



చిత్తూరులో ర్యాలీగా వస్తున్న వైద్యులు, సిబ్బంది



చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట మానవహారం



పుంగనూరులో నోటికి గుడ్డ కట్టుకుని నిరసన

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

● డాక్టర్లు, వైద్య సిబ్బంది నిరసనలు ● జిల్లావ్యాప్తంగా ఆగిన ఓపీ సేవలు

చిత్తూరు రూరల్, ఆగస్టు 17: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచారం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని వైద్యులు, వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఐఎంఏ పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రి(అపోలో) వైద్యుల ఆధ్వర్యంలో 2 వేల మందికి పైగా జూనియర్ డాక్టర్లు ప్రభుత్వాస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం ఎదుట మానవహారం చేపట్టారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మద్దతు తెలిపారు. ఎస్‌పీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల ముందు ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థినులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. నగరి ఏరియా వైద్యశాల, కార్వేటినగరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్లు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి ఫ్లెక్సీలు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు వైద్య సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బంగారుపాళ్యం మండల వైద్యులు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి జాతీయ రహదారిపై ప్లకార్డులు చేతపట్టి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద నిరసన తెలిపారు. పూతలపట్టు మండలం పి.కొత్తకోట వైద్యాధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించి, ర్యాలీ చేపట్టారు. గుడిపాల మండలంలోని గుడిపాల, బొమ్మసముద్రం వైద్యాధికారులు చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టరు దినేష్‌కుమార్ నాయక్, డాక్టర్ వినయ్ సిబ్బందితో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో నిరసన తెలిపారు. సదుం సీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఓపీ సేవలను నిలిపేశారు. వైద్యాధికారిణి పుష్పకుమారితో కలిసి వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. పలమనేరు ప్రభుత్వాస్పత్రి డాక్టర్లు, వైద్య సిబ్బంది ఆస్పత్రి ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. పుంగనూరు ప్రభుత్వాస్పత్రి వైద్యులు సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి, పట్టణంలో మౌన ర్యాలీ నిర్వహించారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన రోజే మహిళా వైద్యురాలిపై అత్యాచారం జరగడం బాధాకరమన్నారు. నిందితుడిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం వ్యవస్థలో లోపాలను ఎత్తి చూపుతోందని, మళ్లీ ఇలాంటివి చేయాలంటే భయపడే విధంగా శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.



ప్రజలు మద్దతు తెలపాలి

ప్రజల కోసం 24 గంటలు పనిచేసే వైద్యులు న్యాయం కోసం పోరాటం చేస్తున్నారు. వారికి మద్దతుగా ప్రజలు వచ్చి పోరాటంలో పాల్గొనాల్సిన అవసరం ఉంది. వైద్యుల రక్షణ కోసం ప్రభుత్వాలు చట్టాలను మరింత కఠినతరం చేయాలి.

– నరేష్‌రెడ్డి, అపోలో యూనిట్ హెడ్



కఠిన చట్టాలు తీసుకురావాలి

వైద్యుల రక్షణ కోసం కఠిన చట్టాలు తీసుకొచ్చి అమలు చేయాలి. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం భరోసా కల్పించాలి. నిందితులను గుర్తించి, కఠినంగా శిక్షించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.

– నిరంజన్‌రెడ్డి, ఐఎంఏ చిత్తూరు అధ్యక్షుడు



బంగారుపాళ్యంలో రోడ్డుపై ధర్నా చేస్తున్న వైద్య సిబ్బంది

24 గంటల పాటు నిలిచిన ఓపీ సేవలు

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపుమేరకు జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర వైద్య సేవలు మినహా ఓపీ సేవలను శనివారం నిలిపివేశారు. అత్యవసర శస్త్ర చికిత్సలు మినహాయించి మిగిలిన శస్త్ర చికిత్సలను కూడా నిలిపివేశారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఓపీ సేవలు ప్రారంభవుతాయని ఐఎంఏ సభ్యులు తెలిపారు. ఓపీ సేవలు అందక రోగులు కొంతమేర ఇబ్బందిపడ్డారు.



నగరి ఏరియా ఆస్పత్రి ఎదుట నిరసన

పుంగనూరులో
టెన్షన్.. టెన్షన్

- మండల మీట్ జరగనివ్వబోమన్న టీడీపీ శ్రేణులు
- భారీగా పోలీసు బలగాల మోహరింపు
- గైర్హాజరైన వైసీపీ సభ్యులు
- కోరం లేక వాయిదాపడ్డ సమావేశం



ఎంపీడీవో కార్యాలయం వద్ద పహారా కాస్తున్న పోలీసులు

పుంగనూరు రూరల్, ఆగస్టు 17: పుంగనూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం టెన్షన్ వాతావరణం నెలకొంది. మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీపీ భాస్కర్‌రెడ్డి సమాచారం ఇవ్వడంతో అధికారులు కార్యాలయానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండలాధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు, కార్యకర్తలు భారీగా అక్కడికి చేరుకున్నారు. వైసీపీ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నిక కాలేదని, నామినేటెడ్ తరహాలో ఎన్నికయ్యారని, అందుకే మండల మీట్ జరగనివ్వబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎంపీడీవో అబ్దుల్‌రహీంకు వినతిపత్రం అందజేశారు. టీడీపీ నేతలు పెద్ద యెత్తున చేరుకోవడంతో పుంగనూరు రూరల్, గంగవరం సీఐలు రాంభూపాల్, ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు మోహరించారు. ఈ క్రమంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి సహా సభ్యులు ఎవరూ హాజరుకాలేదు. కేవలం అధికారులు మాత్రమే రావడం, సభ్యులు లేకపోవడంతో కోరం లేదని సమావేశాన్ని ఎంపీడీవో వాయిదా వేశారు. వైసీపీకి చెందిన కోఆప్షన్ సభ్యులు బావాజాన్, గుడిసింబడ, సింగిరిగుంట సర్పంచులు శోభారాణి, ఆంజప్ప రాగా సభ్యులు ఎవరూ కనిపించకపోవడంతో వెనుదిరిగారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంతో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు



ఎంపీడీవో కార్యాలయం వద్ద గుమికూడిన టీడీపీ నాయకులు

వరసిద్ధుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 17: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణారావు శనివారం కుటుంబ సమేతంగా కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు.



జస్టిస్ గోపాలకృష్ణారావుకు జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

ఖజానా ఉద్యోగుల వివరాలు ఇవ్వండి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 17: ఉద్యోగుల సాధారణ బదిలీలకు మార్గదర్శకాలు జారీ అయిన నేపథ్యంలో ఉప ఖజానా కార్యాలయాల ఉద్యోగుల వివరాలు ఇవ్వాలని ఖజానా శాఖ సంచాలకుల కార్యాలయం కోరింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని డీడీ కార్యాలయంతోపాటు 18 ఎస్టీవో కార్యాలయాల్లోని అన్ని కేడర్ల ఉద్యోగుల వివరాలు కోరింది. సంఘాల పేర్లు చెప్పుకుని జిల్లావ్యాప్తంగా ఏడెనిమిది ఏళ్లకు మించి చాలామంది ఒకేచోట పనిచేస్తున్నారు. చిత్తూరు ఏటీవో, మదనపల్లె ఏటీవోలు ఐదు ఏళ్లకు మించి పనిచేస్తున్నారు. పుత్తూరు, కుప్పం, తిరుపతి, చిత్తూరు ఉప ఖజానా కార్యాలయాల్లోనూ పలువురు ఎస్టీవోలు ఐదేళ్లకు మించి పనిచేస్తున్నారు. పలమనేరు, సత్యవేడు, కుప్పం ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి. చిత్తూరు డీటీవో కార్యాలయంలో ఐదుగురు అధికారులు చాలా ఏళ్లుగా పనిచేస్తున్నారు. సీనియర్, జూనియర్ అకౌంటెంట్లు, షరాఫ్, ఆఫీస్ సబార్డినేట్లు అలాగే కొనసాగుతున్నారు. వారిని వెంటనే బదిలీ చేసి ట్రెజరీ కార్యాలయాల్లో పారదర్శక పాలనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది.

జాయింట్ కలెక్టర్‌గా అభిషేక్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 17: చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు ఐటీడీఏ పీవోగా ఉన్న అభిషేక్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు జేసీగా పనిచేసిన పులి శ్రీనివాసులు ఇటీవల గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఆ పోస్టును ఇప్పుడు భర్తీ చేశారు. 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అభిషేక్ అంతకు ముందు పాడేరులోనే సబ్ కలెక్టర్‌గా పనిచేశారు.





కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.44 కోట్లు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 17: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,44,80,588 లభించింది. హుండీల ద్వారా స్వామికి వచ్చిన కానుకలను శనివారం ఆస్థాన మండపంలో ఇన్‌చార్జి ఈవో వాణి పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది లెక్కించారు. బంగారు 17 గ్రాములు, వెండి 810 గ్రాములు లభించాయి. 645 యూఎస్‌ఏ, 50 ఆస్ట్రేలియా, 10 సింగపూర్ డాలర్లు, ఒక మలేసియా రింగిట్స్, 20 యూరోలు, 95 యూఏఈ దిర్హామ్స్, 5 ఇంగ్లండు పౌండ్లు లభించాయి. గో సంరక్షణ హుండీ ద్వారా రూ.16,741, నిత్యాన్నదాన హుండీ ద్వారా రూ.32,097 వచ్చాయి. 23 రోజులలో ఈ మొత్తం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవో వివరించారు.

టీడీపీ జిల్లా కార్యాలయానికి 1.25 ఎకరాల కేటాయింపు

● రూ.5 లక్షల విరాళమిచ్చిన పార్టీ నేత జయప్రకాష్

చిత్తూరు సిటీ, ఆగస్టు 17: టీడీపీ జిల్లా నూతన కార్యాలయ నిర్మాణానికి 1.25 ఎకరాలను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. బస్టాండు సమీపంలోని ఫిషరీష్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఈ స్థలాన్ని 30 ఏళ్ల లీజుకు కేటాయించారు. త్వరలో ఇక్కడ భవన నిర్మాణం చేపట్టనున్నారు. పార్టీ కార్యాలయ నిర్మాణానికి తొలి విరాళంగా బంగారుపాళ్యం మండల అధ్యక్షుడు, ఎస్‌పీఎస్ హోటల్ అధినేత జయప్రకాష్ నాయుడు రూ.5 లక్షల విరాళాన్ని అందించారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు చేతుల మీదుగా పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌కు ఈ నగదును అందించారు.జయప్రకాష్ నాయుడు మాట్లాడుతూ టీడీపీ కుటుంబ సభ్యులంతా నూతన భవన నిర్మాణానికి తమవంతు సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బాలాజీ నాయుడు, మోహన్‌రాజ్, ధరణి చౌదరి, మోహన్ నాయుడు, విజయ్‌కుమార్, జయచంద్ర నాయుడు, గోపాల్, యువరాజ్, ప్రవీణ్ నాయుడు, చిన్న తదితరులు పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న జయప్రకాష్ నాయుడు

అభివృద్ధి చెందిన రాష్ట్రమే లక్ష్యంగా..



అధికారుల శిక్షణా తరగతుల్లో సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 17: 2047 సంవత్సరానికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చే లక్ష్యంలో అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో అధికారులకు శిక్షణా తరగతులు జరిగాయి. కలెక్టర్ మాట్లాడుతూ వికసిత్ ఆంధ్రప్రదేశ్ - 2047 అమలులో భాగంగా 2024-29కి 15శాతం అభివృద్ధి రేటుతో అంచనాలను సిద్ధం చేయాలన్నారు. తలసరి ఆదాయాన్ని రెట్టింపు చేయడం, పేదరికాన్ని నిర్మూలించడం ధ్యేయంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, ఆ దిశగా పనిచేయాలని సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి, డ్వామా పీడీ రాజశేఖర్, పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ ఉమామహేశ్వర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయ్‌కుమార్, సీపీవో సాంబశివరెడ్డి, జడ్పీ సీఈవో గ్లోరియా, డీఆర్డీఏ పీడీ తులసి పాల్గొన్నారు.

యంత్రభూతానికి బలైన చిన్నారి





యంత్రంలో ఇరుక్కుపోయిన బాలిక, నవ్యశ్రీ(ఫైల్‌ఫొటో)

వాకాడు, ఆగస్టు 17 : కోలాటమాడడానికి వెళ్లిన ఓ చిన్నారి యంత్రభూతానికి బలైపోయింది.వాకాడులో ఏఎస్ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు... వెదురుకుప్పం మండలం మర్రిమాకుల కండ్రిగకు చెందిన బండి నవ్యశ్రీ (11) మరో 20మందితో కలసి తిరుపతి జిల్లా వాకాడులోని మహాలక్ష్మి ఆలయంలో తిరునాళ్లకు కోలాటం వేయడానికి శుక్రవారం వచ్చింది. కోలాటమాడి అలసిపోయిన ఆమె తెల్లవారుజామున జనరేటర్ పక్కనే పడుకుంది.అది ఓపెన్‌టైపు జనరేటర్ కావడంతో ఫ్యాన్‌లో పక్కనే పడుకొని ఉన్న నవ్యశ్రీ జడ చిక్కుకుంది. ఒక్కసారిగా తల మొత్తం జనరేటర్‌లోకి వెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందింది.విగతజీవిగా పడి ఉన్న నవ్యశ్రీని చూసి ఆమెతో వచ్చినవారు కన్నీరుమున్నీరయ్యారు.

జూపార్కులో త్వరలో తెల్లపులుల సఫారీ





జూపార్కులో ఏర్పాటు చేస్తున్న నాక్ టర్నల్ ఎన్‌క్లోజర్

మంగళం, ఆగస్టు 17: ఎస్వీ జూపార్కులో త్వరలో వైట్ టైగర్ సఫారీని తిరిగి ప్రారంభిస్తున్నట్లు జూపార్కు క్యూరేటర్ సెల్వం తెలిపారు. శనివారం జూపార్కులో మీడియాతో మాట్లాడుతూ.. 2018లో వైట్ టైగర్ సఫారీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కరోనా సమయంలో మూసి వేశామన్నారు. ఇపుడు సఫారీలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి, ప్రారంభిస్తామన్నారు. ఇందు కోసం రూ.85లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. అలాగే నాక్ టర్నల్(రాత్రి పూట తిరిగే జంతువులు, పక్షులు) ఎన్‌క్లోజర్ పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. వీటిలో పునుగు పిల్లులు, దేవాంగ పిల్లి, గుడ్లగూబ, తుమ్మల పందులు వంటి జంతువులను ఉంచుతామన్నారు. రూ.6కోట్ల బడ్జెట్‌తో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రాజెక్టుకు టీటీడీ రూ.2కోట్లు మంజూరు చేయగా.. ఇపుడు రూ.4కోట్లు మంజూరు చేసిందన్నారు. ఏడు, ఎనిమిది నెలల్లో ఇది అందుబాటులో వస్తుందన్నారు. జిరాఫీలను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామని.. ఒక జత తెప్పించాలంటే రూ.3కోట్లు ఖర్చవుతుందని వివరించారు. మన జూపార్కులో రెండు జతల జిరాఫీల అవసరం ఉందన్నారు. జూపార్కుకు సందర్శకుల సంఖ్య కూడా పెరిగిందని తెలిపారు. వార్షిక ఆదాయం రూ.8.5కోట్లకు చేరుకుందని, ఈ సంవత్సరం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

స్టార్ ఎయిర్‌లైన్స్‌పై ప్రయాణికుల ఆగ్రహం



స్టార్ ఎయిర్‌లైన్స్ బుకింగ్ కౌంటర్ వద్ద ప్రయాణికుల నిరసన

రేణిగుంట, ఆగస్టు 17: స్టార్ ఎయిర్‌లైన్స్ విమానం రద్దు కావడంతో తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికులు నిరసన తెలిపిన ఘటన శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల మేరకు... శనివారం ఉదయం బెల్గాం నుంచి 10.45 గంటలకు తిరుపతికి వచ్చి 11.45 గంటలకు తిరిగి స్టార్ ఎయిర్‌లైన్స్ విమానం బెల్గాం పోవాల్సివుంది. విమానం రద్దయిన విషయాన్ని ఉదయం ప్రయాణికులకు చెప్పకుండా మధ్యాహ్నం 1.30 గంటలకు చెప్పడంతో అప్పటి వరకు వేచివున్న ప్రయాణికుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. సుమారు 45 నిమిషాల పాటు స్టార్ ఎయిర్‌లైన్స్ బుకింగ్ కౌంటర్ వద్ద సంస్థ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.తరచూ ఇలా జరగడం వల్ల ప్రయాణికులు సంస్థ పట్ల నమ్మకం కోల్పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



యాగశాలలో హోమాలు నిర్వహిస్తున్న ఋత్వికులు

తిరుమల, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం యాగశాలలో ఋత్వికులు హోమాలు నిర్వహించారు. తర్వాత శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం చేపట్టారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపుతో అభిషేకించి చివరగా చందనం పూత పూశారు. ధూపదీప హారతులు నివేదించారు. సాయంత్రం ఉత్సవమూర్తులు ఆలయ మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తర్వాత పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం విమాన ప్రదక్షిణగా ఉత్సవమూర్తులు ఆలయ ప్రవేశం చేయడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈకార్యక్రమ నేపథ్యంలో ఆలయంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.టీటీడీ జీయర్ స్వాములు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో లోకనాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.





స్వామి వారి ఊరేగింపు - స్కందపుష్కరిణిలో స్వామి విహారం

ఘనంగా వేణుగోపాలస్వామి తెప్పోత్సవాలు

వెదురుకుప్పం, ఆగస్టు 17: కార్వేటినగరంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ తెప్పోత్సవాల కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి శుద్ధి, తోమాల,మొదటి గంగ, సర్వదర్శనం కార్యక్రమాలు నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో వేడుకను వీక్షించార. సాయంత్రం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణ, మంగళ వాయిద్యాల మధ్య తిరువీధి ఉత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులు మొక్కులు చెల్లించుకున్నారు. హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి, సంగీత కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాల్లో టీడీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, సిబ్బంది, ప్రధాన అర్చకులు హాజరయ్యారు. రాత్రి సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి స్కంధపుష్కరిణిలో విహరించారు. తెప్పోత్సవ సందర్భంగా భక్తులు స్కందపుష్కరిణి వద్ద కర్పూర హారతులు ఇచ్చారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ అధికారి సురేష్‌కుమార్, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ప్రధాన అర్చకులు గోపాల ఆచార్యులు, శబరి, రమేష్, ఆలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ట్రాక్టర్ చోరీ కేసులో వైసీపీ మండల కన్వీనర్ అరెస్టు



కుప్పం అర్బన్ పోలీసు స్టేషన్ వద్ద మురుగేశ్, వైసీపీ నేతలు

కుప్పం, అగస్టు 17: పంచాయతీకి చెందిన ట్రాక్టర్ చోరీ కేసులో వైసీపీ కుప్పం మండల కన్వీనర్ హెచ్‌ఎం.మురుగేశ్ అరెస్ట్ అయ్యారు. గత ఏడాది పంచాయతీ ట్రాక్టర్ చోరీకి గురైంది. దీనిపై అప్పట్లోనే పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి కుప్పం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పుడు పోలీసులు విచారించగా ట్రాక్టర్ వైసీపీ మండల కన్వీనర్ అధీనంలో ఉన్నట్లు తెలిసింది. ఆయన దాన్ని సొంత పనులకు వినియోగించుకోవడం బయటపడింది. కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడు మురగేశ్‌ను అరెస్టు చేసి, కోర్టు ముందు హాజరుపరిచారు. కోర్టు ఆయనకు 15రోజుల రిమాండ్ విధించింది. అలాగే ఆయనపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదైంది. కుప్పం మండలంలోని మల్లానూరు పంచాయతీలో ఈనెల 9వ తేదీన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తనను మురుగేశ్ కులం పేరుతో దూషించారని ఎమ్మార్పీఎస్ నాయకుడు ప్రకాశ్ కుప్పం అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన పోలీసులు మురుగేశ్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

అన్న చేతిలో తమ్ముడి హతం



రక్తపు మడుగులో పడి ఉన్న చెంగప్ప

పెద్దపంజాణి, ఆగస్టు 17: అన్న చేతిలో తమ్ముడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన పెద్దపంజాణి మండలం మట్టిగానిపల్లెలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మట్టిగానిపల్లెకు చెందిన వెంకట్రమణ, చెంగప్ప(55) అన్నదమ్ములు. వీరి మధ్య ఆస్తి తగాదాలున్నాయి. ఘర్షణ పడుతుండేవారు. పలుమార్లు గ్రామస్తులు పంచాయతీలు నిర్వహించి సర్దుబాటు చేస్తూ వచ్చారు. అయినా వైరం పెరుగుతూనే వచ్చింది. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం పొలం వద్ద ఇద్దరూ ఘర్షణపడ్డారు. సాయంత్రం ఇంటివద్ద చెంగప్ప కూర్చుని ఉండగా అన్న అయిన వెంకట్రమణ వెనుక నుంచి వచ్చి కత్తితో దాడిచేశాడు. గాయపడ్డ చెంగప్ప రక్తపు మడుగులో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి మతిస్థిమితం లేని కుమారుడు ఉన్నాడు. గంగవరం సీఐ మురళీమోహన్, పెద్దపంజాణి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసునమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.





చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఆటోను ఢీకొన్న కారు : 10మందికి గాయాలు



కేజీ సత్రం వద్ద ఆటోను ఢీకొన్న కారు

బంగారుపాళ్యం, ఆగస్టు 17: చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలోని కేజీ సత్రం వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో 10 మంది గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వి.కోట మండలం మడమందిరం గ్రామానికి చెందిన కొందరు యాదమరి మండలంలోని ఓటేరిపల్లిలో పూజాకార్యక్రమానికి ఆటోలో వెళ్తున్నారు. కేజీ సత్రం మలుపు వద్ద ఆటోను బెంగళూరు వైపు నుంచి చిత్తూరు వెళ్తున్న కారు ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న శివ, చిన్నమ్మ, రాజేష్, సురేష్, నాగరాజు, బాలప్ప, చరబండ్, కేశవలతో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 పైలట్ క్రిష్ణమూర్తి, అములు తూర్తు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



రాకెట్, గ్రహసంచార, రోబో నమూనాలతో విద్యార్థులు

ఐఐటీలో అంతరిక్ష దినోత్సవం

ఏర్పేడు, ఆగస్టు 17: శాస్త్ర సాంకేతిక రంగాల్లో విశిష్ట సేవలందించిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు ఇస్రో అధికారి డాక్టర్ మనీష్ సక్సేనా సూచించారు.జాతీయ అంతరిక్ష దినోత్సవ సందర్భంగా ఏర్పేడులోని ఐఐటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్, నవవిష్కర్ ఐ-హబ్ ఫౌండేషన్ కలసి సెలబ్రేటింగ్ స్పేస్ అండ్ ఇంటర్‌స్టెల్లార్ ఫెస్ట్ ఫర్ స్కూల్ పేరుతో శనివారం ఓ కార్యక్రమాన్ని ఐఐటీలో నిర్వహించారు.26 ప్రైవేటు పాఠశాలలతో పాటు 6 ప్రభుత్వ పాఠశాలల నుంచి వెయ్యిమందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. బెంగళూరు ఇస్రో ప్రధాన కార్యాలయ శాటిలైట్ నావిగేషన్ ప్రోగ్రాం ఆఫీస్ డైరెక్టర్ డాక్టర్ మనీష్ సక్సేనా , శ్రీహరికోట ఎస్‌డీఎస్‌సీలోని పీసీక్యూజ, సాలిగ్ మోటార్స్ ప్రొఫెలెంట్ కాంప్లెక్స్ చీఫ్ జనరల్ మేనేజరు డాక్టర్ టీవీ రమణారెడ్డి తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనల గురించి వివరించారు. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ,నవవిష్కర్ ఐహబ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రోషన్ శ్రీవాత్సవ నావిగేషన్ ప్రాముఖ్యతను వివరించారు. 80మంది విద్యార్థులు ప్రసంగ పోటీల్లో, 120మంది విద్యార్థులు క్విజ్ పోటీల్లో, 150మంది విద్యార్థులు డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్నారు.సౌరవ్యవస్థ, స్పేస్‌కాలనీ మోడల్, గ్రహాల వ్యవస్థ, కాంతి, నీడలపై తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఆదివారం సాయంత్రం బహుమతులను అందజేయనున్నారు.

సమయానికి జీతాలు తీసుకున్నట్టే పనులు కూడా చేయండి

● విద్యుత్ అధికారులకు ఎస్‌ఈ సురేంద్రనాయుడు హెచ్చరిక



అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌ఈ సురేంద్రనాయుడు

చిత్తూరు రూరల్, ఆగస్టు 17: సమయానికి జీతాలు తీసుకుంటున్నట్టే పనులు కూడా అదే తరహా చేయాలంటూ విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సురేంద్రనాయుడు తమ సిబ్బందిని మందలించారు. చిత్తూరు రూరల్ డివిజన్ కార్యాలయంలో శనివారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేయడం లేదని తనకు సమాచారముందన్నారు. ఇకనైనా మారకుంటే సస్పెండ్ తప్పదని హెచ్చరించారు. చాలా మంది అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. బుధవారం నిర్వహించే విద్యుత్ శాఖ గ్రీవెన్స్ డే అధిక సంఖ్యలు ఫిర్యాదు వస్తున్నాయన్నారు. వాటిని పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో సక్రమంగా పనులు చేస్తే ఫిర్యాదులు ఎందుకు వస్తాయని ప్రశ్నించారు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు ఏఈలను ఇప్పటికే పక్కన పెట్టామనే విషయాన్ని గుర్తు చేశారు.

పాళ్యంకొండలో గుప్తనిధుల కోసం తవ్వకాలు



తవ్వకాలకు ప్రయత్నిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు

గుడిపాల, ఆగస్టు 17: మండలంలోని మారుమూల ప్రాంతమైన నారగల్లు రెవెన్యూకు సంబంధించి ఆంజనేయస్వామి ఆలయ భూముల్లో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధులకోసం తవ్వకాలు జరిపారు. వీరిని గమనించిన గ్రామస్థులు పట్టుకునేందకు ప్రయత్నించారు. అయితే అప్పటికే వారు తప్పించుకుని పారిపోయారు. పౌర్ణమి, అమవాస్య రోజుల్లో ఈవిధంగా తవ్వకాలు చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు.

పావురాల కోసమెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్నాడు

విద్యుత్ వైర్లపై పడి బాలుడి మృతి





విద్యుత్ వైర్లపై వేలాడుతున్న దౌలాత్ - దౌలాత్(ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, ఆగస్టు17: పావురాల కోసం వెళ్లి బాలుడు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటన శనివారం పుంగనూరులో చోటుచేసుకుంది. కొత్తపేటకు చెందిన మాజీ సైనికుడు రఫీక్ కుమారుడు దౌలాత్(13) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఇంటి పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పావురాలను గమనించాడు. వాటిని పట్టుకునే ప్ర యత్నంలో వైర్లపై పడ్డాడు. చుట్టుపక్కల వారు గుర్తించి, కేకలు వేయడంతో విద్యుత్ శాఖాధికారులు అక్కడికి చేరుకుని బాలుడికి కిందకు దించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ అలీంబాషా ఘటనా స్థలానికి చేరుకుని ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు. సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ముగ్గురు సీఐలకు పోస్టింగ్

చిత్తూరు, ఆగస్టు 17: జిల్లాలో ఇటీవల జరిగిన బదిలీల్లో వీఆర్‌లో ఉన్న ముగ్గురు సీఐలకు శనివారం పోస్టింగ్‌లు కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వారిని అన్నమయ్య జిల్లాకు బదిలీ చేసింది. విశ్వనాథరెడ్డిని రాయచోటి ట్రాఫిక్‌కు బదిలీ చేసింది. అలాగే రవిశంకర్‌రెడ్డిని అన్నమయ్య జిల్లా దిశ-1కు, మద్దయ్య ఆచారిని స్పెషల్ బ్రాంచి-2కు బదిలీ చేసింది.

రాజనాలబండలో శ్రావణ శనివారం పూజలు



చౌడేపల్లె, ఆగస్టు17: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో శ్రావణ మాసం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు స్వామి వారికి పంచామృతాభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉపవాస దీక్షతో స్వామివారిని భక్తులు దర్శంచుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక బస్టాండులో వెలసిన కమలాంజనేయస్వామి, కర్ణంవారిపల్లె అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

పీఈఎస్‌లో నేడు ఉచిత కంటి చికిత్స శిబిరం

రామకుప్పం, ఆగస్టు 17: కుప్పం పీఈఎస్ వైద్యకళాశాల ఆస్పత్రి, రామకుప్పం వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం రామకుప్పంలో ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో రోగులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందజేస్తామని వివరించారు. ఎంపిక చేసిన వారిని పీఈఎస్‌కు తరలించి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని వెల్లడించారు

ప్రశంసా పత్రాలు అందుకున్న అధికారులు




రామకుప్పం, ఆగస్టు 17: రామకుప్పం పంచాయతీలో ఉత్తమ సేవలందించినందుకు ఈఓఆర్‌డీ రాధాకృష్ణ, సచివాలయ ఉద్యోగి యువరాజులు శనివారం డీపీఓ లక్ష్మీ చేతుల మీదుగా స్వాతంత్ర దినోత్సవ ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ప్రశంసా పత్రాలను అందుకున్న రాధాకృష్ణ, యువరాజులను ఎంపీడీవో ఈశ్వరన్న, మండల పరిషత్ సిబ్బంది అభినందించారు.

పలమనేరులో పట్టపగలే చోరీ.. మహిళపై దాడి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శరణ్య

పలమనేరు, ఆగస్టు17 : పలమనేరు గంటావూరు కాలనీలో గంగమ్మ గుడి సమీపంలోని ఓ ఇంట్లో పగలే చోరీ జరిగింది. ఆలయ సమీపంలో శరణ్య కుటుంబం ఉంటోంది. శరణ్య శనివారం మిద్దెపైకి వెళ్లిన సమయంలో ఓ ఆగంతకుడు మూతికి ముసుగు వేసుకొని ఇంట్లోకి ప్రవేశించాడు. బీరువాను తెరచి రూ. 50వేలు నగదు, 7 గ్రాములు బంగారు చైను దొంగిలించి వెళ్లే సమయంలో శరణ్య గుర్తించింది. ఆమె అతడిని నిలదీసేందుకు యత్నించగా కత్తితో దాడిచేసి పారిపోయాడు. ఆమె కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు శరణ్యను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

తిమ్మరాయస్వామి ఆలయంలో చోరీ



రామకుప్పం, ఆగస్టు 17: మండలంలోని సింగసముద్రం గ్రామంలోని తిమ్మరాయస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. ఆలయ గేట్‌ను, తర్వాత హుండీని పగులగొట్టి అందులోని నగదును దోచుకెళ్లారు. అలాగే వినాయకుడి పంచలోహ విగ్రహాన్ని తీసుకెళ్లారు. దుండగులు తీసుకెళ్లిన విగ్రహం విలువ రూ.70వేలు నుంచి రూ.లక్ష ఉంటుందని, హుండీలో సుమారు రూ.20వేలు నగదు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

నాగాలమ్మ ఆలయంలో వార్షిక వేడుకలు



కల్లూరు, ఆగస్టు 17: పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లిలో వెలసిన నాగాలమ్మ ఆల యంలో శనివారం వార్షికోత్సవం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో వేకువ జాము నుంచే వేడుకలు ప్రారంభం కాగా ఉదయం అమ్మవారికి పాలాభిషేకం, కుంకుమాభి షేకం, గంధమాభిషేకం, పంచామృతాభిషేకం, హోమం, అర్చనలు, ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం వేద పండితులు అనంతకుమారాచార్యుల మంత్రోచ్ఛరణల నడుమ వైభవో పేతంగా అశ్వర్థనారాయణ కల్యాణోత్సవం నిర్వహించారు.

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి, శనీశ్వరస్వామి

రామకుప్పం, ఆగస్టు 17: శ్రావణ శనివారం, శని త్రయోదశి కలిసి రావడంతో రామకుప్పం శివార్లలోని ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిశాయి. వళ్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలోని వేంకటేశ్వరాలయం, శనీశ్వరాలయాల్లో శ్రావణ శనివార పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల నుంచే కాకుండా కర్ణాటక సరిహద్దు గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి రావడంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. భక్తులు దేవతామూర్తులను దర్శించుకుని అర్చనలు చేయించారు. కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులిచ్చారు. సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

బోరును బాగుచేయించండి



పలమనేరు, ఆగస్టు17 : పలమనేరు లక్ష్మీనగర్‌కాలనీలో బోరు మరమ్మతులకు గురికావడంతో మున్సిపల్ సిబ్బంది బోరు పైపులను తొలగించారు. పైపులు తొలగించి దాదాపు 20 రోజులు కావస్తున్నా ఇప్పటికీ బాగుచేయలేదు. అధికారులు స్పందించి బోరును బాగుచేసి నీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

భక్తి శ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు

సోమల, ఆగస్టు 17: మండలంలోని చిన్నదేవళకుప్పంలో శ్రావణ మాసం శని త్రయోదశిని పురస్కరించుకొని శనీశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు జరిపారు. అర్చకులు అభిషేకపూజలు, అర్చనలు నిర్వహిం చారు. పలు గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బైరెడ్డిపల్లె: మండలంలోని గంగినేపల్లె గ్రామసమీపంలో వున్న శనీశ్వరస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి అభిషేకం చేసి విశేషాలంకరణతో ప్రత్యేకపూజలు జరిపారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. విచ్చేసిన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పశుగణన సర్వే పరిశీలన

రొంపిచెర్ల, ఆగస్టు17: సోమల ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టరు జి.శ్రీనివాస్‌నాయుడు శనివారం రొంపిచెర్లలో పర్యటించారు. పశుగణన సర్వే, గోకులాల కు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించారు. పశువైద్యాధికారికి తగు సూచనలు ఇచ్చారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐలు




పలమనేరు/గంగవరం, ఆగస్టు17 : పలమనేరు అర్బన్, రూరల్ సీఐలు నరసింహరాజు, మురళీమోహన్‌లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని మర్యాదపూర్వకంగా కలి శారు. పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియ జేశారు.

తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించాలి


మంత్రికి వినతిపత్రం అంజేస్తున్న తులసినాథంనాయుడు, పుష్ప దంపతులు

పలమనేరు, ఆగస్టు17 : తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు పి.తులసినాథంనాయుడు, పుష్ప దంపతులు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. శనివారం వారు విజయవాడలో మంత్రిని కలిసి సత్కరించి వినతి పత్రం అందజేశారు. అన్నిపాఠశాలల్లో తెలుగుభాషా దినోత్సవం నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. వారు ఇచ్చిన లేఖను విద్యాశాఖ మంత్రికి పంపించారు.

దివ్యాంగులకు మధ్యాహ్న భోజనం వితరణ



పలమనేరు, ఆగస్టు17 : పలమనేరు సమీపంలోని దివ్యాంగులు పాఠశాలలోని విద్యార్థులకు శని వారం స్థానిక సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు కుటుంబసభ్యులు మధ్యాహ్నభోజనం విత రణగా అందజేశారు. మధుమోహన్ రావు కుమారుడు కార్తికేయ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పలమనేరు, ఆగస్టు17 : మండలంలోని ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. స్కూల్ కాంప్లెక్సు మీటింగ్‌లు, సబ్జెక్టు శిక్షణను ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం ప్రారంభించారు. ఈ శిక్షణలో విద్యార్థులకు సబ్జెక్టుల్లో ఏ విధంగా బోధించాలి, నాలెడ్జి షేరింగ్, విద్యార్థుల ద్వారా ఇన్నోవేటింగ్ కార్యక్రమాలు ఏ విధంగా చేయించాలి తదితర విషయాలు వివరించనున్నట్లు ఎంఈఓవోలు తెలిపారు. మండలంలోని స్కూల్ కాంప్లెక్సు ట్రైనింగ్‌లు పలమనేరులోని బాలురు, బాలికల పాఠశాలలతో పాటు పెంగరగుంట ఉన్నత పాఠశాలలో, ఉర్దూ కాంప్లెక్సు ట్రైనింగ్ స్థానిక ఉర్దూ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉపాధ్యాయులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలని కోరారు. సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

మెరుగైన బోధన అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శివరత్న

సోమల, ఆగస్టు 17: పాఠశాల్లోని విద్యార్థులకు మెరుగైన బోధన, నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో శివరత్న సూచించారు. శనివారం స్థానిక హైస్కూల్లో సీఆర్సీ సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులను ఆకట్టుకునేలా బోధనలు చేయాలన్నారు. చదువులో వెనుక బడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సమావేశంలో క్లస్టర్ కార్యదర్శి యల్లయ్య, క్లస్టర్ స్థాయి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి



పలమనేరు నినాదాలు చేస్తున్న డాక్టర్లు, వైద్యసిబ్బంది, రొంపిచెర్లలో అంజలి ఘటిస్తున్న వైద్యులు వైద్య సిబ్బంది

- కోల్‌కతా హత్యాచార ఘటనపై వైద్యులు, వైద్య సిబ్బంది నిరసన
- ఓపీ సేవలు బంద్

పలమనేరు, ఆగస్టు17 : వైద్యులకు రక్షణ కల్పించాలని పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రిలోని డాక్టర్లు, వైద్యసిబ్బంది కోరారు. కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచారానికి నిరసనగా శనివారం ఆస్పత్రి ఎదుట నిరసన తెలియజేశారు. డాక్టర్లు నాయక్, మమతారాణి, శారద, యుగందర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. రానున్న 24గంటలు అత్యవసర సేవలు మాత్రమే అందిస్తామని స్పష్టం చేశారు.

పుంగనూరు: కోల్‌కతాలో మహిళా డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డిమాండ్ చేశారు. శనివారం వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి పట్టణ పురవీధుల్లో మౌన ర్యాలీ చేశారు. అనంతరం వైద్యులు హరిగోపాల్ మాట్లాడుతూ వైద్యుల రక్షణ కోసం ప్రభుత్వాలు కఠిన చట్టాలను తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, నర్సులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ● ముడిపాపనపల్లె పీహెచ్‌సీ పరిధిలోని వైద్యులు ప్లకార్డులు పట్టుకుని నిరసన ర్యాలీ చేశారు. వైద్యులకు రక్షణ కల్పించడంతో పాటు నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, డాక్టరు దినేష్‌కుమార్ నాయక్, డాక్టర్ వినయ్, సిబ్బంది డిమాండ్ చేశారు. శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో నిరసన తెలియజేశారు.

సదుంలోనూ ఆగిన ఓపీ సేవలు

సదుం: కలకత్తా వైద్యురాలి హత్యను నిరసిస్తూ సదుం సీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆస్పత్రిలో ఓపీ సేవల్ని శనివారం నిలిపివేశారు. వైద్యాధికారి పుష్పకుమారి మాట్లాడుతూ హంతులను కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమెతోపాటు వైద్యులు, సిబ్బంది మొత్తం నిరసన వ్యక్తం చేశారు.


సదుం ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రయోగశాలలను సమర్థవంతంగా నిర్వహించండి


అవగాహన కల్పిస్తున్న జిల్లాసైన్స్ అధికారి రమణ

బైరెడ్డిపల్లె, ఆగస్టు 17 : పాఠశాలల్లో ఉన్న ప్రయోగశాలలను సమర్థ వంతంగా నిర్వహించడానికి సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి రమణ కోరారు. మండలంలోని కమ్మనపల్లె ఆదర్శ పాఠశాలలో శనివారం జరిగిన సైన్స్ ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సైన్స్ అధికారి రమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం సైన్స్ ఉపాధ్యాయుల బాధ్యతని తెలియజేశారు. ఇందుకు ప్రయోగశాల సరైన వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులతో ప్రయోగాలు చేయించడంద్వారా పాఠ్యాంశాలలోని శాస్త్రీయ భావనలను సులభంగా అర్థం చేసుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 20 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, 18 స్టెమ్‌ల్యాబ్‌లు, 64 పాల్‌ల్యాబ్‌లు, 243 సైన్స్‌ల్యాబ్‌లు, 8 నిచ్చల్‌ల్యాబ్‌లు ఉన్నాయన్నారు. ఈ ల్యాబ్‌లను ఉపాధ్యాయులు సక్రమంగా నిర్వహించి ప్రయోగాలు, పరిశీలనలు, విధానాలు, ఫలితాలను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ అనిత, సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కుప్పం పాలిటెక్నిక్ అభివృద్ధికి ప్రణాళికలు

కడాకు నివేదిక సమర్పించిన అధికారులు

కుప్పం, ఆగస్టు 17: కుప్పంలోని డాక్టర్ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళిక తయారైంది. కడా (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ఆధ్వర్యంలో నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం విజన్ డాక్యుమెంట్ తయారైంది. ఈ డాక్యుమెంట్ కోసం వివిధ ప్రభుత్వ శాఖల పరంగా చేపట్టాల్సిన పనులు, అందుకు అవసరమయ్యే అంచనాలు కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో రూపొందించారు. ఇందులో కుప్పంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు సంబంధించిన అభివృద్ధి ప్రతిపాదనలు తయారయ్యాయి. ఎస్బీయూ ప్రాంతీయ సంచాలకులు ఎ.నిర్మల్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావులు ఈ ప్రతిపాదనలు తయారు చేసి కడాకు సమర్పించారు. కళాశాలకు అవసరమైన తరగతి గదులు, ప్రయోగశాలలు, ప్రయోగశాల పరికరాలు, కళాశాల ఉన్న 25 ఎకరాల విస్తీర్ణం కవర్ చేస్తూ ప్రహరీ నిర్మాణం, బాలబాలికలకు వసతి గృహాలు, క్రీడామైదానం వంటివి ఈ ప్రతిపాదనల్లో ఉన్నాయి. అదేవిధంగా ప్రస్తుతమున్న కోర్సులతోపాటు అదనపు కోర్సులు ప్రారంభించడానికి కూడా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నూతన అదనపు కోర్సులు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెపొందించి విద్యార్థులు సత్వర ఉపాధి పొందేలా ఉండాలని కోరారు. అలాగే ప్రస్తుతం కళాశాలలో డిప్లొమో చదువుతున్న విద్యార్థులకు అదనపు నైపుణ్యం పెపొందించేదానికి 'ఆడ్ ఆన్' కోర్సులను త్వరలో కళాశాలలో ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జగన్నాథరావు తెలిపారు. ఈ ఆడ్ ఆన్ కోర్సులలో ఇంటర్నెంట్ ఆఫ్ థింగ్స్ (ఐ.ఓ.టి.), సాలిడ్ ఎడ్జ్ తదితర ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన నైపుణ్యాభివృద్ధికి ఉపయోగపడుతాయన్నారు. ఈ కోర్సుల ఫీజులు కేవలం రూ.1500 మాత్రమేనన్నారు. కోర్సు డ్యూరేషన్ 90 గంటలని చెప్పారు. ఆడ్ ఆన్ కోర్సులు కళాశాలలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటలదాకా నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

జనసేనలో చేరిన పులిచెర్ల వైసీపీ నాయకులు



కల్లూరు, ఆగస్టు 17: పులిచెర్ల మండలానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు శనివారం తిరుపతిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. పుంగనూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ చిన్నరాయల్ ఆధ్వర్యంలో మండలంలోని కావేటిగారిపల్లి, ఎల్లంకివారిపల్లి, మంగళంపేట పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు మునిశంకర్, వెంకట్రామయ్య, సానేమధు, మునికృష్ణ, కేశవులు, మధు, మునేష్, మునిశేఖర్ తదితరులు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి రమణ, నాయకులు చంద్రబాబు, మోహన్, మునేష్, ఆంజి, ఫిరోజ్‌బాషా, కుమార్, గంగాధరం, గిరీష్, హరి పాల్గొన్నారు.

ఉపవాస దీక్షలతో అక్కదేవతలకు పూజలు



సోమల, ఆగస్టు 17: సూరయ్య గారిపల్లెలో శుక్రవారం రాత్రి 11 గంటలకు అక్క దేవతలకు భక్తులు ఉపవాస దీక్షలతో పూజలు జరిపారు. ఉభయ దారులు విశాంత్ర ఉపాధ్యాయుడు పోకల రామచంద్ర, విజయ కుమారి ఇంటి నుంచి అక్కదేవతల పూజా సామగ్రిని మంగళవాయిద్యాలు, బాణసంచా వేడుకల నడుమ స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. కోర్కెలు తీరిన భక్తులు నూతన అశ్వవాహనాలను ఉపవాసదీక్షలతో ఆలయం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం శాస్త్రోక్తంగా అశ్వవాహనాలను ఊరేగింపుగా అక్కదేవతల ఆలయం వద్దకు తీసుకెళ్లి పచ్చ కార్యక్రమం చేపట్టారు. సోమల, కరకమంద, నడింపల్లె, సూరయ్యగారిపల్లె, ఊటుపల్లె భక్తులు రాత్రి జాగరణలతో పూజలు, అభిషేకాలు జరిపారు. ఉభయదారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సోమల సంత.. వసతుల చింత


సంత చింత చెట్టునీడలో, పట్టల నీడన జరుగుతున్న సంత

సోమల, ఆగస్టు 17: సోమల వారపు సంతలో వసతులు లేక క్రయ, విక్రయదారులు అవస్థలు పడాల్సి వస్తోంది. 50 ఏళ్ల చరిత్ర గల వారపు సంతకు ఏటా వేలం పాటలతో లక్షలు ఆదాయం పంచాయతీకి వస్తోంది. వచ్చే ఆదాయంలో కొంతైనా వ్యయం చేసి ఉంటే అభివృద్ధి జరిగివుండేది. చుట్టు పక్కల గ్రామాలు ఎక్కువగా వుండడంతో ప్రతి శనివారం సంత రోజున రైతులు, వ్యాపారస్తులు, మారు వర్తకం చేసేవారు కూరగాయలు కొనుగోలు చేసేవారు సంతకు వస్తారు. మండలంలోని గ్రామాల నుంచే కాకుండా సదుం, చౌడేపల్లె, కలికిరి, పుంగనూరు మండలాల వారు వస్తారు. సంతకు విశాల స్థలం ఉన్నా షెడ్లు లేకపోవడంతో కూరగాయలు కింద పెట్టుకుని అమ్ముకోవాల్సి వస్తోంది. ఎండావానలకు గుడారాలు వేసుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. కనీసం తాగునీటి వసతి లేదు. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేదు. సంత చౌడేపల్లి- సదుం ప్రధాన రోడ్డు పక్కనే వుండడంతో సంతలో స్థలం లేని కొందరు రోడ్డుపైనే కూరగాయల దుకాణాలను ఏర్పాటు చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని పలు సార్లు వినతులు అందజేసినా ఫలితం లేకపోయిందని స్థానికులు వాపోతున్నారు. కాగా నంజంపేట, కందూరు, పెద్దఉప్పరపల్లెలో జరిగే వారపు సంతలకు సొంత స్థలాలు లేక రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలంలోని వారపు సంతల్లో కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

పల్స్ సర్వేని వేగవంతం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో అబ్దుల్ రహీం

పుంగనూరు రూరల్, ఆగస్టు17: గ్రామీణ ప్రాంతాల్లో పల్స్ సర్వేని వేగవంతంగా పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అబ్దుల్‌రహీం సూచించారు. శనివారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయాలని, ఎక్కడైనా జ్వరాలు సోకిన వెంటనే వైద్యసిబ్బందితో కలసి గ్రామాల్లో పర్యటించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నేడు యాదవసంఘ సమావేశం

పుంగనూరు, ఆగస్టు17: ఈ నెల 26న నిర్వహించే శ్రీకృష్ణ జన్మదిన వేడుకల నిర్వహణపై చర్చించడానికి నియోజకవర్గంలోని యాదవ కులస్థులు హాజరుకావాలని యాదవ సంఘ నాయకుడు భీమగానిపల్లె రమణ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణ సమీపంలోని శ్రీకృష్ణ దేవాలయంలో సోమవారం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పుంగనూరు కోర్టును పరిశీలించిన జిల్లా జడ్జి



పుంగనూరు, ఆగస్టు17: పుంగనూరు కోర్టు భవనాలను జిల్లా న్యాయమూర్తి భీమారావు పరిశీలించారు. శనివారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఆయనను స్వాగతం పలికారు. ఆయన వారితో సమీక్షించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పుంగనూరు కోర్టుకు న్యాయమూర్తులను నియమించాలని కోరారు.

మళ్లీ వాయిదాపడిన కీలతొరడి ఎస్‌ఎంసీ ఎన్నిక

బైరెడ్డిపల్లె, ఆగస్టు 17 : మండలంలోని కీలతొరడి ప్రాథమిక పాఠశాలలో ఇటీవల జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నిక సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరక వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శనివారం మరోసారి ఎన్నిక నిర్వహణకు సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ సభ్యులమధ్య ఏకాభిప్రాయం కుదరక మళ్లీ వాయిదాపడింది.

జనసేన వీల్ చైర్ వితరణ



వెదురుకుప్పం, ఆగస్టు 17: పచ్చికాపల్లం పంచాయతీ బొమ్మ నదొడ్లకు చెందిన లక్ష్మీకాంతమ్మకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న శనివారం వీల్‌చైర్‌ను వితరణ చేశారు. కార్యక్రమంలో వెదురుకుప్పం మండల పార్టీ యువజన అధ్యక్షుడు కావలి సతీష్, నాయకులు రాఘవ, భానుచంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఓ ప్రమాదంలో గాయపడిన విద్యార్థిని దీక్షితను పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. పార్టీ మండల ప్రధానకార్యదర్శి బెనర్జీ ఉన్నారు.

ఇంటింటికీ నీటి కుళాయి సర్వే పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, ఆగస్టు 17: నగరంలో నీటి కుళాయి సర్వేను కమిషనర్ అరుణ పరిశీలించారు. శనివారం ఆమె టెలిఫోన్ కాలనీలో పర్యటించారు. వార్డు అమినిటీ, అడ్మిన్ కార్యదర్శులు సర్వే తీరును వివరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రతి నీటి కుళాయి ద్వారా నీటిని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సర్వేను నిర్వహిస్తోందన్నారు.

డ్రోన్లతో మందు పిచికారి

దోమల వృద్ధిని నియంత్రించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, నీటి కుంటల్లో దోమ లార్వాలను నాశనం చేయడానికి డ్రోన్లతో మందును పిచికారి చేయాలని కమిషనర్ అరుణ చెప్పారు. ఇందుకు డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు వివరించారు. శనివారం బాలాజీ కాలనీ, ఓబనపల్లె ప్రాంతాల్లో నీటి కుంటలు, నీటి నిల్వ ప్రాంతల్లో డ్రోన్ల సాయంతో వెక్టోబాక్ మందును పిచికారి చేశారు.

29 నుంచి వేణుగోపాలస్వామికి పవిత్రోత్సవాలు

వెదురుకుప్పం, ఆగస్టు 17: వేణుగోపాలస్వామి ఆలయ పవిత్రోత్సవాలు ఈనెల 29,30 తేదీల్లో నిర్వహించనున్నారు. ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈనెల 29న ఆచార్య రుత్విక్‌వరణం, సాయంత్రం మృత్సం గ్రహణం, సేనాధిపతి తిరువీధిఉత్సవంతో పవిత్రోత్సవాలకు అంకురార్పరణ చేస్తారు. 30వ తేది ఉదయం మూలవర్లకు తిరుమంజనం, పవిత్రాల సమర్పణ నిర్వహిస్తారు. సాయంత్రం వీధి ఉత్సవం నిర్వహిస్తారు.

సీఆర్సీని సందర్శించిన ప్లానింగ్ కోఆర్డినేటర్



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న కోఆర్డినేటర్

విజయపురం, ఆగస్టు 17: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సీఆర్సీ సమావేశాన్ని జిల్లా ఎంఐఎస్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ జయప్రకాష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో హరిప్రసాద్‌వర్మ, సీఆర్సీ హెచ్‌ఎం శ్యామల, పాల్గొన్నారు.

వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం



ఉభయదారులకు సత్కారం

వెదురుకుప్పం, ఆగస్టు 17: దేవర గుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలోని వన వేణుగోపాలస్వామికి శనివారం క్షీరాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు కె.కార్తీక్ అయ్యంగార్ ప్రత్యేక పూజలు నిర్వహించి, అలంకరించారు. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. వారికి తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం చేశారు. ఉభయదారులను సత్కరించారు. ప్రధాన కార్యనిర్వాహకులు శివ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి సత్కారం



గుడిపాల, ఆగస్టు 17: మండలంలోని బొమ్మసముద్రం ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలగా ఎంపికయిన నేపథ్యంలో శనివారం ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారిని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఘనంగా సత్కరించారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయులు ఆ పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ విద్యాకమిటీ చైర్మన్ ధనసింగ్, టీడీపీ నాయకులు దొరబాబు, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మైనార్టీసెల్ అధ్యక్షుడికి ఎమ్మెల్యే పరామర్శ

చిత్తూరు సిటీ, ఆగస్టు17: ఇటీవల విజయవాడలో రైలు ప్రమాదంలో గాయపడిన టీడీపీ నియోజకవర్గ మైనార్టీసెల్ అధ్యక్షుడు జాఫర్‌ను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పరామర్శించారు. శనివారం నగరంలోని కట్టమంచిలోని ఆయన నివాసానికి వెళ్ళి చికిత్స పొందుతున్న జాఫర్‌ను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ నేతలు వసంత్ కుమార్‌బాబు రెడ్డి, శంకర్, కుమార్‌లు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మాదకద్రవ్యాల విక్రయాలను అరికట్టండి : టీడీపీ



ఎస్ఐతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గుడిపాల, ఆగస్టు 17: మండలంలో మాదకద్రవ్యాల విక్రయాలు అరికట్టాలని స్థానిక టీడీపీ నాయకులు శనివారం ఎస్ఐ రామమోహన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. బొమ్మ సముద్రం, కమ్మతిమ్మాపల్లి క్రాస్, వెంగంపల్లి, చిత్తపార తదితర ప్రాంతాల్లో గంజాయి, కర్నాటక మద్యం విక్రయాలతో యువత భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. వీటిని అరికట్టే చర్యలు చేపట్టి యువతను కాపాడాలన్నారు. ఎస్ఐని కలిసిన వారిలో బాలాజీ నాయుడు, హరినాయుడు, చంద్ర, నాగరాజు, బొడేబ్బనాయుడు, విల్‌సన్, సాంబశివ, గోపిలు ఉన్నారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడిని కలిసిన కూటమి నేతలు



గుడిపాల, ఆగస్టు 17: కూటమి ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం మండలంలో కాణిపాకం నుంచి తిరువణ్ణామలై వెళ్తున్న ఆయనను గుడిపాలలో మండల టీడీపీ, జనసేన నాయకులు కలసి శాలువ కప్పి పుష్ప గుచ్ఛం అందించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలాజి నాయుడు, మండల జనసేన అధ్యక్షుడు రూప్‌కుమార్, టీడీపీ నాయకులు నాగరాజ్ యాదవ్, సాంబశివ నాయుడు, అనిల్ కుమార్, నాగరాజు, గోపి, హరినాయుడు, గోవింద్ గౌడ్, రవి నాయుడు, ఆనంద్ యాదవ్, విల్‌సన్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీని అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే



ప్రత్యేక ప్రతిభావంతులకు వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, ఆగస్టు 17: ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో పూతలపట్టు పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం దివ్యాగులకు వీల్‌చైర్లు, వాకింగ్ స్టిక్‌లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ప్రవీణ్, కిరణ్ నాయక్, శ్రీనివాసమూర్తి, మండల టీడీపీ అధ్యక్షుడు దొరబాబు చౌదరి, మాజీ కన్వీనర్ చంద్రమౌళి, పీహెచ్‌సీ మాజీ చైర్మన్ గుంటూరు మురళి, టీడీపీ నాయకులు హరి, మంజునాథ్, ఎస్. దాము, మునిరాజులు, జయప్రకాష్, అర్జున్, శేషాద్రి నాయుడుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

20న ఎస్జీటీల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 18: జిల్లా మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీ (తెలుగు/హిందీ) పదోన్నతులకు సంబంధించి ఈనెల 20న ఉదయం 11 గంటలకు డీఈవో కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలను పరిశీలించనున్నారు. డీఈవో దేవరాజు శనివారం ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. 2017 అక్టోబరు 10 నాటికి ఖాళీలకు గాను సీనియారిటీ జాబితా ఆధారంగా జరిగే ప్రక్రియలో టీచర్లు ఒరిజినల్ సర్టిఫికేట్లు, సర్వీసు రిజిస్టార్లు పరిశీలించనున్నట్లు తెలిపారు.

టైల్స్ కార్మికుడి అనుమానాస్పద మృతి

చిత్తూరు, ఆగస్టు 17: అనుమానాస్పద స్థితిలో ఓ కార్మికుడు మృతి చెందాడు. రెండో పట్టణ ఎస్ఐ ప్రసాద్ వివరాల మేరకు. తమిళనాడుకు చెందిన జీవా చిత్తూరు నగరం పిళ్ల యార్‌కోవిల్ వీధికి చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకుని ఇక్కడే నివాసముంటున్నాడు. ఇతను ఇళ్ల నిర్మాణాల్లో టైల్స్‌వేసే పనులు చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన జీవా మంగసముద్రం చెరువులో శవమై తేలాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సదాశివేశ్వరస్వామి ఆలయంలో ప్రదోష పూజ



వెదురుకుప్పం, ఆగస్టు 17: కార్వేటినగరం సదాశివేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. అర్చనలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం నందీశ్వరునికి ప్రదోష పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మోహన్‌రాజు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జనసేనలో చేరిన పులిచెర్ల వైసీపీ నాయకులు



కల్లూరు, ఆగస్టు 17: పులిచెర్ల మండలానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు శనివారం తిరుపతిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. పుంగనూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ చిన్నరాయల్ ఆధ్వర్యంలో మండలంలోని కావేటిగారిపల్లి, ఎల్లంకివారిపల్లి, మంగళం పేట పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు మునిశంకర్, వెంకట్రామయ్య, సానేమధు, మునికృష్ణ, కేశవులు, మధు, మునేష్, మునిశేఖర్ తదితరులు జనసేన పార్టీ తీర్థం పుచ్చు కున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి రమణ, నాయకులు చంద్రబాబు, మోహన్, మునేష్, ఆంజి, ఫిరోజ్‌బాషా, కుమార్, గంగాధరం, గిరీష్, హరి పాల్గొన్నారు.

పలమనేరులో పట్టపగలే చోరీ మహిళపై దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శరణ్య

పలమనేరు, ఆగస్టు17 : పలమ నేరు గంటావూరు కాలనీలో గంగమ్మ గుడి సమీపంలోని ఓ ఇంట్లో పగలే చోరీ జరిగింది. ఆలయ సమీపంలో శరణ్య కుటుంబం ఉంటోంది. శరణ్య శనివారం మిద్దెపైకి వెళ్లిన సమ యంలో ఓ ఆగంతకుడు మూతికి ముసుగు వేసుకొని ఇంట్లోకి ప్రవేశించాడు. బీరువాను తెరచి రూ. 50వేలు నగదు, 7 గ్రాములు బంగారు చైను దొంగిలించి వెళ్లే సమయంలో శరణ్య గుర్తించింది. ఆమె అతడిని నిలదీ సేందుకు యత్నించగా కత్తితో దాడిచేసి పారిపోయాడు. ఆమె కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు శరణ్యను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ అభివృద్ధికి ప్రణాళిక

కుప్పం, ఆగస్టు 17: కుప్పంలోని డాక్టర్ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళిక తయారైంది. కడా (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ఆధ్వర్యంలో నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం విజన్ డాక్యుమెంట్ తయారైంది. ఈ డాక్యుమెంట్ కోసం వివిధ ప్రభుత్వ శాఖల పరంగా చేపట్టాల్సిన పనులు, అందుకు అవసరమయ్యే అంచనాలు కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో రూపొందించారు. ఇందులో కుప్పంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు సంబంధించిన అభివృద్ధి ప్రతిపాదనలు తయారయ్యాయి. ఎస్వీయూ ప్రాంతీయ సంచాలకులు ఎ.నిర్మల్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావులు ప్రతిపాదనలు తయారు చేసి కడాకు సమర్పించారు. కళాశాలకు తరగతి గదులు, ప్రయోగశాలలు, ప్రయోగశాల పరికరాలు, కళాశాల ఉన్న 25 ఎకరాల విస్తీర్ణం కవర్ చేస్తూ ప్రహరీ నిర్మాణం, బాలబాలికలకు వసతి గృహాలు, క్రీడామైదానం వంటివి ఈ ప్రతిపాదనల్లో ఉన్నాయి. అదనపు కోర్సులు ప్రారంభించడానికి కూడా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెపొందించి విద్యార్థులు పాధి పొందేలా ఉండాలని కోరారు.

కదంతొక్కిన జూనియర్ వైద్యులు

కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ మండల కేంద్రాల్లో విధుల బహిష్కరణ





పాలసముద్రం ,విజయపురంలలో నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ వైద్యులు, వైద్యసిబ్బంది

పాలసముద్రం: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌ను అమానవీయంగా హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది శనివారం విధులు బహిష్కరించారు. డాక్టర్ లోకేష్, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్‌ఎంలు అరుణ, సుశీల, సునీత, లత, రేవతి, ఆశావర్కర్లు నిరసనలో పాల్గొన్నారు.**నగరి:** ఏరియా వైద్యశాల డాక్టర్లు సిబ్బంది నల్లబ్యాడ్జిలు ధరించి ప్లెక్సీలతో నిరసన వ్యక్తం చేశారు. మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ కేంద్ర ప్రభత్వం సీరియస్‌గా తీసుకుని అసలైన దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఆర్ఎంఒ కార్తీక్, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ జలీనా, డాక్టర్ బాలకృష్ణ నాయక్, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ జయంత్, డాక్టర్ శ్రీనాథ్ ,పాల్గొన్నారు. **విజయపురం:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణంలో వైద్యులు, సిబ్బంది పకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. వైద్యాధికారులు సోమశేఖర్, విష్ణుప్రియ పాల్గొన్నారు. **బంగారుపాళ్యం:** మండల వైద్యులు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి జాతీయ రహదారిపై ప్లకార్డులు, కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద నిరసన తెలిపారు. డాక్టర్లు శిరీష, విజయకుమార్, స్వరూప్, అఖిల్, రాఘభావన, భార్గవ్ క్రిష్ణ, షాలిని తదితరులు పాల్గొన్నారు. **ఐరాల:** స్థానిక ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ పూర్ణలత, సిబ్బంది విధులను బహిష్కరించారు. **వెదురుకుప్పం:** కార్వేటినగరం కమ్యునిటీ హెల్త్ సెంటర్ వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. **గుడిపాల:** చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిపై గుడిపాల ప్రాథమిక ఆస్పత్రి వైద్యాధికారులు ధర్నా చేశారు. **చిత్తూరు (సెంట్రల్):** స్థానిక ఎన్‌పీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల ముందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థినులు కొవొత్తులతో నిరసన తెలిపారు. జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. **పూతలపట్టు:** పి.కొత్తకోట వైద్యాధికారులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. **చిత్తూరు రూరల్:** చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో నిరసనకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సంఘీభావం తెలిపారు.



చిత్తూరులో వైద్యులకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే గురజాల

ప్రజోపయోగ పనులు చేపట్టాలి : ఎమ్మెల్యే మురళి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె, ఆగస్టు 17: గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులు ప్రజలకు ఉపయోగపడాలని ఎమ్మెల్యే మురళీమోహన్ సూచంచారు. పనులను వెంటనే వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి ఆధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు శుద్ధ తాగునీరు అందించడానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. అధికారులు ప్రజలకు జవాబుదారిగా ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. అనంతరం శాఖల వారీగా సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్, జడ్పీటీసీ భారతి, ఎంఈవో హేమలత, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 17: ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లో చిత్తూరు ప్రెస్‌క్లబ్, ఏపీయూడబ్ల్యూజే జిల్లాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పాత్రికేయుల సమక్షంలో కలెక్టర్ సుమిత్ కుమార్ కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీయూడబ్ల్యూజే నాయకుల పోరాటాలు మరువలేనివన్నారు. పాత్రికేయుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. సంఘం జిల్లా కన్వీనర్ ఎం. లోకనాథం, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడు మహేష్, సంయుక్త కార్యదర్శి షకీల్, కోశాధికారి పవన్‌కుమార్, సీనియర్ జర్నలిస్టులు వీరరాఘవులు, శివప్రసాద్‌తో పాటు పలు మీడియా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషనుకు త్వరలోనే నడకదారి: తహసీల్దార్



బొమ్మసముద్రం రైల్వేస్టేషన్ మార్గాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి

గుడిపాల, ఆగస్టు 17: బొమ్మసముద్రం రైల్వేస్టేషన్‌కు నడకదారి కల్పించాలనే రైల్వే అధికారుల అభ్యర్థన మేరకు తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి శనివారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయం, ధర్మరాజుల గుడిల మధ్య నడకదారిని ఏర్పాటు చేయాలని యోచించారు. త్వరలో దారి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట సర్వేయర్ కిరణ్, ఆర్ఐ రామసాయి, వీఆర్వో పవన్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల లేఅవుట్లపై విచారణ చేపట్టండి

బంగారుపాళ్యం, ఆగస్టు 17: గత ప్రభుత్వంలో పేదల ఇండ్ల స్థలాల లేఅవుట్లపై విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే మురళీమోహన్ సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అమరావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ అధికారులు మండల అభివృద్ధి, సమస్యలను సభ్యులకు తెలియజేశారు. పలువురు సభ్యులు రెవెన్యూశాఖకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అప్పటి ఇన్‌చార్జి ఎమ్మార్వోగా వ్యవహరించిన అనిల్‌కుమార్ రెడ్డి మొగిలిలో సర్వేనెం. 135లో సుమారు వందెకరాల వరకు వైసీపీకి చెందిన వారికి పట్టాలిచ్చారని మొగిలివారిపల్లి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. భూముల వివాదం కోర్టులో ఉందన్నా కూడా లెక్క చేయకుండా పట్టాలు మంజూరు చేశారన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ విచారణ చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోకా ప్రకాష్ నాయుడు, ఎంపీడీవో శివశంకర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో దుర్భర పరిస్థితులు: బీజేపీ



ఇందిరమ్మ కాలనీ వాసులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నగరి ఆగస్టు17: మున్సిపాలిటీ పరిధిలోని టీఆర్‌కండ్రిగ సమీపాన ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కాలనీలో శనివారం వారు పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు వీధులు బురదమయమయ్యాయన్నారు. కాలువలు లేక మురికినీరు వీధుల్లో ప్రవహిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. వీధిదీపాలు లేక కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. వర్షాకాలం ఈప్రాంతం మునిగిపోతోందని, మురికినీటి ఇందులో కలిసిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. పారిశుధ్య లోపంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారన్నారు. తక్షణం మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. బీజేపీ నాయకులు రమేష్‌నాయుడు, మునికృష్ణమనాయుడు, మోహన్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మరాయస్వామి ఆలయంలో చోరీ

రామకుప్పం, ఆగస్టు 17: మండలంలోని సింగసముద్రం గ్రామంలోని తిమ్మరాయస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. ఆలయ గేట్‌ను, తర్వాత హుండీని పగులగొట్టి అందులోని నగదును దోచుకెళ్లారు. అలాగే వినాయకుడి పంచలోహ విగ్రహాన్ని తీసుకెళ్లారు. దుండగులు తీసుకెళ్లిన విగ్రహం విలువ రూ.70వేలు నుంచి రూ.లక్ష ఉంటుందని, హుండీలో సుమారు రూ.20వేలు నగదు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

తహసీల్దార్ అరుణకుమారికి సన్మానం



పాలసముద్రం, ఆగస్టు 17: తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన అరుణకుమారిని శనివారం రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి పేదప్రజలకు న్యాయం చేయాలని కోరారు. రెవెన్యూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. టీడీపీ నాయకులు వెంకటేశులు నాయుడు, శేఖర్ రాజు, వాసు యాదవ్, రవి, వీఆర్వో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



విజయపురం, ఆగస్టు 2: మల్లారెడ్డి కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం రిటైర్డు ప్రధానోపాధ్యాయులు చద్రయ్య విద్యా సామగ్రి పింపిణీ చేశారు. ఒకటి నుంచి ఐదు వరకు చదువుతున్న విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్, నోటుపుస్తకాలు వితరణగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం ఎస్ఐగా ధరణీధర్



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 17: కాణిపాకం ఎస్ఐగా ధరణీధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన రామమ్మోహన్ గుడిపాలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ ధరణీధర్ మాట్లాడుతూ తమ పరిధిలో నేరాలు జరగకుండా చూస్తామన్నారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఏలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహిస్తామన్నారు.

క్యాన్సర్ బాధితునికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబీకులకు చెక్కు అందజేస్తున్న గురజాల

చిత్తూరు రూరల్, ఆగస్టు 17: క్యాన్సర్‌తో బాధపడుతూ చెన్నైలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త మురళిని ఆదుకోవాలని గురజాల పిలుపుమేరకు పలువురు టీడీపీ నాయకులు స్పందించారు. బాధితునిది రూరల్ మండలంలోని ముత్తుకూరు. జీజేఎం ట్రస్టు ద్వారా రూ.2.30 లక్షల చెక్కును మురళీ కుటుంబానికి శనివారం అందజేశారు. టీడీపీ జిల్లా కార్యదర్శి జయచంద్రనాయుడు, నాయకులు లక్ష్మీపతి, మోహన్‌బాబు, మురళీ, సుభిక్ష ఫామ్స్ ప్రతినిధులు విరాళాలు ఇచ్చిన వారిలో ఉన్నారు.

కుష్ఠు బాధిత కేసుల పరిశీలన



యాదమరి, ఆగస్టు 17: అనుమానిత కుష్ఠు బాధిత కేసులను డీ ఎంవో మణి శనివారం పరిశీలించారు. 15 రోజుల పాటు యాదమరి పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో సర్వేను నిర్వహించారు. ఆశావర్కర్లు, వైద్యసిబ్బంది పలు అనుమానిత కేసులను గుర్తించారు. శనివారం ఈ కేసులను డీఎంవో పరిశీలించగా ఇద్దరికి కుష్ఠువ్యాధి లక్షణాలు ఉన్నట్లు నిర్ధారించారు. సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, ఏపీఎంవో దేవన్, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.